సాక్షి తిరుపతి

గురువారం । 21 । డిసెంబర్ । 2023



తుమ్మలగుంటకు వైకుంఠ శోభ

వైకుంఠ ఏకాదశికి తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయాన్ని శోభామానంగా తీర్చిదిద్దుతున్నారు. - 8లో



పోలీసులకు వితరణ

జిల్లా పోలీస్ శాఖకు హీరో మోటార్స్ యాజమాన్యం రూ.కోటి విలువైన 80 బైక్‌లు వితరణగా అందించింది. - 8లో



జగనన్న వెంటే జనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని చేపట్టిన పాదయాత్ర బుధవారం తిరుపతికి చేరింది. - 8లో

న్యూస్‌రీల్

పండుగలా ‘ఆడుదాం’



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పండుగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 47 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, డీఎల్‌డీఓలు సుశీలా దేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,040 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.17 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

స్కౌట్స్ ట్రైనింగ్ కౌన్సిలర్‌గా సుబ్రమణ్యం



ఏర్పేడు: స్కౌట్స్ అండ్ గైడ్ మాస్టర్ ట్రైనింగ్ జిల్లా కౌన్సిలర్‌గా మండలంలోని బండారుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు డీఈఓ శేఖర్ ఎంపిక చేసినట్లు వెల్లడించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్

ప్రోత్సహిస్తూ.. దీవెనలందిస్తూ..!

పేదింటి బిడ్డలు ఉన్నతంగా చదువుకోవాలి.. ఆర్థిక స్తోమత లేని ప్రతిభావంతులైన పిల్లలకు అండగా నిలవాలి.. అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసేలా చేయూతనందించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మక పథకం అమలు చేస్తున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పేరిట సాయం అందిస్తున్నారు. ప్రపంచంలోని ప్రముఖ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన వారి చదువుకు కావాల్సిన నగదును అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఉత్తీర్ణులైన వారికి సైతం వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మరింత మెరుగ్గా రాణించేలా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

- విదేశీ విద్యాదీవెన పథకం కింద విద్యార్థులకు ఆర్థికసాయం
- 14 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1,46,68,708 జమ
- జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద నలుగురికి రూ.4లక్షలు పంపిణీ

తిరుపతి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన వరమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సప్లయి ప్రోత్సాహకం జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందినవారు ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు విద్యాదీవెన కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లాలో అర్హులైన 14 మంది విద్యార్థులకు రూ.1,46,68,708 అందజేసినట్లు వెల్లడించారు. ఈ పథకం కింద గత ఏడాది అందించిన రూ 2.31 కోట్లతో కలిసి మొత్తం రూ 3.78 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ఆ మేరకు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు.

ప్రిలిమినరీకి ప్రోత్సాహకం...

జగనన్న సివిల్ సర్వీసెస్ పథకం కింద జిల్లా నుంచి ఎంపికైన నలుగురు విద్యార్థులకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.4లక్షలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి వెల్లడించారు. ప్రిలిమినరీ పాసైన విద్యార్థులకు రూ. లక్ష, మెయిన్స్ ఉత్తీర్ణులైతే అదనంగా మరో రూ. 50 వేలు అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులు తమ లక్ష్యం చేరుకునేందుకు కావాల్సిన శిక్షణ, ప్రిపేర్ అయ్యేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోందన్నారు. ఎలాంటి పరిమితి లేకుండా అభ్యర్థులు ప్రిలిమినరీ, మెయిన్స్ పాసైన ప్రతిసారీ నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నామని, ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికార అధికారి సూర్య నారాయణ పాల్గొన్నారు.

సుపరిపాలనతో సంక్షేమ వెలుగులు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు వెల్లివిరిశాయని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. సీఎం వైఎస్ జన్మదినోత్సవాల్లో భాగంగా బుధవారం కొర్లగుంటలో కార్పొరేటర్లు నరేంద్ర, ఎస్కే ఇమామ్ ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కట్ చేయించారు. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన జగన్ మామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు అంటూ విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందిందని తెలిపారు. అనంతరం నగరంలోని 29, 38, 01, 48వ డివిజన్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా వార్డుల్లో సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు నేరుగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నగదు అందించలేదన్నారు. పేదప్రజలకు జగనన్న అందిస్తున్న పథకాలను చూసి ఓర్వలేక అటు చంద్రబాబు, ఇటు పవన్‌కల్యాణ్ అసత్య ఆరోపణలు చేస్తూ విషం కక్కుతున్నారని మండిపడ్డారు. జగనన్న పేదల జీవితాల్లో వెలుగులు నింపింతే చంద్రబాబు మాత్రం పేదల బతుకుల్లో చీకట్లు నింపారని విమర్శించారు. పేదల జీవితాలతో ఆడుకున్న చంద్రబాబుకు ఓట్లు వేస్తారో? ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన జగనన్నకు ఓట్లు వేస్తారో? ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజలకు చేసిన ద్రోహం చాలదని, ఇప్పుడు కొత్తగా పవన్‌కల్యాణ్‌తో పొత్తుపెట్టుకుని మరోసారి మోసం చేయడానికి కట్టుకథలు అల్లుతున్నాడని ఆరోపించారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, జగనన్న అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని వెల్లడించారు. ఎక్కడికి వెళ్లినా మళ్లీ జగనే మాకు సీఎంగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జగనన్న చేసిన మంచే వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, తలారి రాజేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జులు ఆదం సుధాకర్‌రెడ్డి, పడమటి కుమార్, సురేంద్రరెడ్డి, వాసు యాదవ్, కార్పొరేటర్లు నరేంద్ర, ఆదం రాధాకృష్ణారెడ్డి, ఆదిలక్ష్మి, అన్నా సంధ్య, ఎస్కే ఇమామ్, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి పాల్గొన్నారు.

యువత భవితకు భరోసా

- చంద్రగిరిలో వైఎస్సార్ మెగా జాబ్‌మేళా
- 4,300 మంది నిరుద్యోగుల రిజిస్ట్రేషన్
- 1,306 మందికి ఆఫర్ లెటర్లు
- ఎంపిక చేసిన 33 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు



పేరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న అభ్యర్థులు

చంద్రగిరి : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన × వైఎస్సార్ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవాల్లో భాగంగా బుధవారం చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మాస్ సంస్థ, ఏపీఎస్ఎస్‌డీసీ సౌజన్యంతో చేపట్టిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు 4,300 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, అక్కడికక్కడే 1,306 మందికి నియామక పత్రాలు అందజేశారు. మిగిలిన వారికి తర్వాత కాల్ లెటర్స్ పంపించనున్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రశంసలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జాబ్ మేళాను సందర్శించారు. ఏర్పాట్లపై ప్రశంసలు కురిపించారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, ఆర్సీ పురం , పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం మండలాల నుంచి విచ్చేసిన ఉద్యోగార్థులకు పక్కాగా వసతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఉదయం నుంచి సాయంత్రం వరకు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉద్యోగ నియామక ఉత్తర్వులు స్వయంగా మోహిత్ రెడ్డి వారికి అందజేశారు. జాబ్ మేళాకు విచ్చేసిన సంస్థ ప్రతినిధులను మోహిత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. జాబ్ మేళాకు విచ్చేసిన యువతకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరితపించే వారని వెల్లడించారు. మేళా విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో యువత రక్తదానం చేశారు. ఈ క్రమంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, చైతన్ తదితరులు రక్తదానం చేయడం విశేషం.



జాబ్‌మేళా పరిశీలనలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు

బ్రిడ్జి కోర్సులో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐటీఐలో 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు పాలిటెక్నిక్ డిప్లొమాలో ద్వితీయ సంవత్సరం ప్రవేశం పొందేందుకు నిర్వహించే బ్రిడ్జి కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారం ఈ మేరకు పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఐటీఐ, పదో తరగతి విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 20నుంచి జనవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 85000 21856, 94416 65290, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

రెచ్చిపోయిన గ్యాంబ్లింగ్ గ్యాంగ్...!

- ఆటోడ్రైవర్ కిడ్నాప్, హత్యాయత్నం
- ప్రాణాపాయస్థితిలో బాధితుడు

తిరుపతి రూరల్: తిరుపతితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో జూదం జోరుగా సాగుతోంది. రూ.కోట్లలో సాగుతున్న పేకాటను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించినా ఎక్కడా తగ్గడం లేదు. ఆటకు అడ్డుగా ఉండే వారిని హత్య చేసేందుకు సైతం గ్యాంబ్లర్స్ బరి తెగిస్తున్నారు. తాజాగా తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులకు సమాచారం అందించాడని ఓ ఆటో డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి, చావగొట్టి చనిపోయాడనుకుని తిరుపతికి తీసుకువచ్చి పడవేసి వెళ్లారు. వివరాల్లోకి వెళ్లితే.. తిరుపతి రైల్వేకాలనీకి చెందిన రూపి, వెంకట కల్యాణ్, చోటు, సుదర్శన్‌రెడ్డి పేకాట ఆడుతుండేవారు. నాలుగు రోజుల క్రితం తిరుపతి ఇందిరానగర్‌లో నివాసం ఉండే గణేష్‌కు చెందిన ఆటోలో రామచంద్రాపురం మండలంలో ఓ ప్రదేశంలో పేకాట ఆడేందుకు వెళ్లారు. పోలీసులు వచ్చి వారిని అరెస్టు చేశారు. బయటకు వచ్చిన గ్యాంబ్లింగ్ బ్యాచ్ తమను ఆటోడ్రైవర్ గణేష్ పోలీసులకు పట్టించాడని గ్యాంబ్లింగ్ బ్యాచ్ రూపి, వెంకటకల్యాణ్, చోటు, సుదర్శన్‌రెడ్డి కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన కారులో వచ్చి గణేష్‌ను బలవంతంగా ఎక్కించుకుని తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లి పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నది ప్రాంతానికి తీసుకెళ్లి విచక్షణరహితంగా కొట్టారు. మా మీదే పోలీసులకు చెపుతావా..? అంటూ చితక్కొట్టారు. అనంతరం చనిపోయాడనుకుని కారులో తీసుకువచ్చి తిరుపతి బైరాగిపట్టెడ వద్ద ఎవరూ చూడకుండా పడేసి వెళ్లారు. తీవ్ర గాయాలతో ఉన్న గణేష్‌ను స్థానికులు తిరుపతి రుయాకు తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు రూపి, వెంకటకల్యాణ్, చోటు, సుదర్శన్‌రెడ్డి, మరికొందరుపై ఐపీసీ 367,307 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ ఎస్‌ఐ మూర్తి తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

తుమ్మలగుంటకు వైకుంఠ శోభ




విద్యుద్దీప కాంతుల్లో తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం, ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

- కల్యాణ వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు
- ఆకట్టుకునేలా పుష్పాలంకరణ
- కనువిందు చేస్తున్న స్వాగత తోరణాలు
- పర్యవేక్షిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్ : శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి తుమ్మలగుంటను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామి ఆలయ పరిసరాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి తెప్పించిన సుగంధభరిత పుష్పాలు, పచ్చని తోరణాలతో కల్యాణ వెంకన్న ఆలయం నూతన శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి తొక్కిసలాటలు లేకుండా పకడ్బందీగా క్యూలు ఏర్పాటు చేశారు. టీటీడీ గోశాల వద్ద వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

శనివారం వేకువనే..

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో శనివారం ఉదయం 4 గంటలకు భక్తులను ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించనున్నారు. ముక్కోటి ఏకాదశితోపాటు న్యూ ఇయర్ కూడా వస్తుండడంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తనున్నారు. ఈ క్రమంలో ఆలయం వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేకంగా పార్కింగ్

స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు తెలుగు తల్లి విగ్రహం నుంచే వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నారు. టీటీడీ డెయిరీ ఫామ్ ఆవరణలో ప్రత్యేకంగా పార్కింగ్‌కు స్థలం కేటాయించారు. జాతీయ రహదారిపై నుంచి వచ్చే వాహనాలను తుమ్మల గుంట చెరువు వద్ద పార్క్ చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు.




ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు

జగనన్న వెంటే జనం



అలిపిరిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

తిరుపతి కల్చరల్ : సంక్షేమ పథకాలతో ప్రజారంజకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. జయహో జగనన్న పేరిట విజయనగరం జిల్లా నుంచి తిరుమలకు ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం తిరుపతిలోని అలిపిరి చేరుకుంది. వారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంవీఎస్ మణి ఘన స్వాగతం పలికారు. అనంతరం అలిపిరి పాదాల మండపం వద్ద ఎమ్మెల్సీ రఘురాజు కొబ్బరికాయలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 200 మందితో 43 రోజులుగా సుమారు 800 కిలోమీటర్లు పాదయాత్ర సాగిందన్నారు. సంక్షేమ సారథి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల హామీల్లో 95 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాలని ఆకాంక్షిస్తూ తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు. జగనన్న పుట్టినరోజు నాడు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు వివరించారు.

పోలీసులకు హీరో మోటార్స్ వితరణ

తిరుపతి క్రైమ్: జిల్లా పోలీసుశాఖకు హీరో మోటార్స్ యాజమాన్యం రూ.కోటి విలువైన 80 ద్విచక్రవాహనాలను బుధవారం వితరణగా అందించింది. ఎమ్మార్‌పల్లెలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ బైక్‌లను పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ విధులకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పృథ్వీ షోరూమ్ అధినేత పృథ్వీరెడ్డి, హీరో మోటార్స్ కార్పొరేట్ హెడ్ కిరణ్ పాల్గొన్నారు.



బైక్‌లు ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, షోరూమ్ ప్రతినిధులు

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్

గూడూరు రూరల్ : గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను సెబ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 80 కేజీల గంజాయి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. బూదనం టోల్‌ప్లాజా వద్ద సెబ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వేగంగా వెళుతున్న రెండు కార్లను అనుమానంతో నిలిపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఈ మేరకు ఏఎస్పీ రాజేంద్ర మాట్లాడుతూ తెలంగాణలోని హస్తినాపురం, బోడుప్పల్, నల్గండ టౌన్, శంషాబాద్, నార్కెట్‌పల్లెకు చెందిన పి.ప్రశాంత్‌రెడ్డి, బొంతా పరమేష్, బొంతా ప్రసాద్, దాసర్ల శేఖర్, గొలుసుల నరేష్ రెండేళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. వీరిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిందితులు అనకాపల్లె వద్ద ఓ వ్యక్తికి రూ.4లక్షలు చెల్లించి 80 కేజీల గంజాయి కొనుగోలు చేశారని చెప్పారు. కర్ణాటక, తమిళనాడులో విక్రయించేందుకు వెళుతూ పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ విజయకుమార్, ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, కానిస్టేబుల్స్ రమేష్, వీఎస్ ప్రసాద్, కృష్ణయ్య, ఎస్కే బాషా, టీజీ ఆనంద్‌బాబు, జి.రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కియా ఈవీ-6 ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో మంగళవారం సాయంత్రం కియా ఈవీ-6 ఎలక్ట్రిక్ సూపర్‌స్టార్ నూతన కారును ఆవిష్కరించారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా ఈవీ-6 ఎలక్ట్రిక్ సూపర్ స్టార్ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 708 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. 5.2 సెకండ్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని, అల్ట్రా ఫాస్ట్ ఛార్జింగ్ ద్వారా 18 నిమిషాల్లో 80 శాతం చార్జింగ్ అవుతుందన్నారు. ఇంటలిజెంట్ సేఫ్టీ లెవల్-2లో 8 ఎయిర్ బ్యాగులు ఉన్నాయని వివరించారు. ఎలక్ట్రిఫైయింగ్ పెర్ఫామెన్స్ డ్యూయల్ మోటార్‌ను ఏడబ్ల్యూడీ సిస్టంతో 605 ఎన్‌ఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కారు బ్యాటరీ 8 ఏళ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీ ఉందన్నారు. కారు ఎక్స్ షోరూం ధర రూ.60.95 లక్షలని, 5 రంగుల్లో లభిస్తుందన్నారు. బుకింగ్ కోసం 86888 29739, 92814 93688లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమా రెడ్డి, ఆశీష్ రెడ్డి, షోరూం సీనియర్ మేనేజర్ రాజ్ కుమార్, మేనేజర్ సోమనాథ్ లాల్ పాల్గొన్నారు.



కారు ఆవిష్కరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి తదితరులు

ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉద్యోగాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కంపెనీల ప్రతినిధులు

- వివిధ కంపెనీల్లో 127 మందికి ఉద్యోగాలు
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: రాష్ట్రప్రభుత్వం ఉపాధికల్పనే లక్ష్యంగా జాబ్‌మేళాలను నిర్వహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 23 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్న జాబ్‌మేళాలో 321 మంది అభ్యర్థులు పాల్గొనగా 127 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కళాశాల ప్రతినిధులు టి.నరసింహులు, ఎ.సంధ్య, పి.సుజన, కిషోర్, రసూల్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు చైతన్య, అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూత



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

తిరుచానూరు(చంద్రగిరి): చేనేత కార్మికులను అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుచానూరు శిల్పారామంలో బుధవారం రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన – 2023ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలు ఆరోగ్యకరమైనవని తెలిపారు. అన్ని సీజన్లలో ధరించవచ్చన్నారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కోసం 120 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ధర్మవరం, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఉప్పాడ, నారాయణవనం, మంగళగిరి, చీరాల, మాధవరం, హ్యాండీ క్రాఫ్ట్, బెడ్ షీట్స్ ఉన్నాయని వెల్లడించారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన మంగళవారం నుంచి జనవరి 2 వరకు ఉంటుందన్నారు. ఉత్పత్తి ధరలకే నేరుగా చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ పిచ్చేశ్వరరావు, డెవలప్‌లప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌశల్ జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో అధికారులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ మెయిన్స్ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డైట్‌లో నిర్వహించిన కౌశల్ 2023 జిల్లాస్థాయి మెయిన్స్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు జిల్లా నుంచి 56 స్కూళ్లకు 130 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, అందులో 36 స్కూళ్ల విద్యార్థులు క్విజ్ పోటీలకు, 20 పాఠశాలల విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో రాష్ట్రస్థాయి పోటీలకు మొదటి స్థానంలో ఎంపీపీ పాఠశాల సదుం, జీహెచ్ఎస్ చిత్తూరు, అలాగే రాష్ట్రస్థాయి పోస్ట ర్ ప్రజెంటేషన్‌కు జెడ్పీహెచ్ఎస్ పుదు పేట నగరి, జెడ్పీహెచ్ఎస్ 49 కొత్తపల్లి మిట్ట స్కూళ్లు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు విజయకు మార్, మనోజ్‌కుమార్, డైట్ సీనియర్ అధ్యాపకులు ప్రభాకర్‌రాజు, చెంగల్‌రాజు పాల్గొన్నారు.

పుదుపేట పాఠశాలకు ఫస్ట్ ప్రైజ్

నగరి : జిల్లాస్థాయిలో నిర్వహించిన కౌశల్ క్విజ్ పోటీల్లో మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి దక్కిందని హెచ్ఎం టీవీ రమేష్ తెలిపారు. ×సుస్థిర అభివృద్ధి కొరకు హరిత శక్తి₹ అనే అంశంపై క్విజ్ నిర్వహించగా విద్యార్థి హరిప్రియ, గైడ్ టీచర్ శశిరేఖ ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనభరచి ప్రథమ బహుమతి దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

తేనెటీగల పెంపకంపై అంతర్జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో బుధవారం తేనెటీగల పెంపకం, అభివృద్ధి అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభమైంది. వీసీ భారతి మాట్లాడుతూ ఏపికల్చర్ ప్రాధాన్యతను వివరించారు. ఆచార్య సామసూల్ రజిత్ మాట్లాడుతూ మలేషియా వర్సిటీలో ముళ్లులేని తేనెటీగల పెంపకం, తేనె సేకరణ పద్ధతులను తెలియజేశారు. మలేషియా నుంచి విచ్చేసిన మన్సూరు ఇస్మాయిల్ మాట్లాడుతూ ముల్లు లేని తేనెటీగల ద్వారా సేకరించే తేనే ద్వారా ఉత్పత్తుల తయారీని తెలియజేశారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ గుండె పోటుతో మృతి చెందిన ఘటన బుదవారం వేకువజామున బూదనం టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. తమిళనాడులోని సేలం జిల్లా పెరుమాళ్లపాళానికి చెందిన పెరియస్వామి(55), రామకృష్ణన్ అనే ఇద్దరు లారీ డ్రైవర్లు చెన్నై నుంచి సంగారెడ్డికి ప్లాస్టిక్ డబ్బాల లోడ్డుతో మంగళవారం రాత్రి బయలు దేరారు. బూదనం టోల్ ప్లాజా దగ్గరుకు వచ్చే సరికే పెరియార్ స్వామి గుండెల్లో నొప్పిగా ఉందని సహచరుడితో చెప్పాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన క్రీడాపోటీలు

తిరుపతి(అలిపిరి) : టీటీడీకి చెందిన తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండురోజులుగా జరుగుతున్న రీజినల్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్, గేమ్స్ మీట్-2023 బుధవారం రాత్రి ముగిసింది. పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ డీన్ యస్.విజయ భాస్కర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమములో పలు టీటీడీ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, పది పాలిటెక్నిక్ కాలేజీల నుంచి విద్యార్థులు , పోటీదారులు పాల్గొన్నారు. గెలుపొందిన వారు జనవరి 4, 5వ తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

సీఎం పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం

చంద్రగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతను మోహిత్ రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. ఆయన సోదరుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, బాబాయి చెవిరెడ్డి రఘునాథరెడ్డి, చైతన్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని అభినందిస్తున్న తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి